క్లుప్తంగా

పడుకున్న చోటే కార్మికుడి మృతి

కొత్తూరు: పడుకున్న చోటనే ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన నందిగామ మండలం మొదళ్లగూడలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రామయ్య వివరాల మేరకు.. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అశోక్(48) మరి కొంత మందితో కలిసి గ్రామ శివారులోని సింబాయాసిస్ యూనివర్సిటీలో లేబర్ పనుల నిమిత్తం ఇరవై రోజుల క్రితం వచ్చాడు. ఆదివారం విధులు ముగిసిన అనంతరం తోటి కార్మికులతో కలిసి భోజనం చేసి పడుకున్నాడు. ఉదయం ఎంతకూ లేవకపోవడంతో తోటి కార్మికుడు నిద్ర లేపడానికి ప్రయత్నించగా చలనం లేకపోవడంతో వెంటనే షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు.. అతను అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉంది.

'కంటి వెలుగు'తో ప్రజలకు మేలు


కంటి వెలుగు శిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధికారులు

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. సోమవారం మండలంలోని పులుసుమామిడి గ్రామంలో సర్పంచ్ శరీఫాబేగమ్ ఆధ్వర్యంలో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'షాద్‌నగర్‌లో బీజేపీ జెండా ఎగురవేద్దాం'

కొందుర్గు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ గడ్డపై బీజేపీ జెండాను ఎగురవేద్దామని బీజేపీ నేత అందె బాబయ్య పిలుపునిచ్చారు. సోమవారం చౌదరిగూడలో పార్టీ మండలాధ్యక్షుడు కుర్మయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో దేశం, రాష్ట్రంలో బీజేపీ పాలన వచ్చేలా కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, నాయకులు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

కోలాహలంగా ప్రతిష్ఠాపన విగ్రహాల ఊరేగింపు


కేరళ వాయిద్యకారుల ప్రదర్శన

శంకర్‌పల్లి: పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో ప్రతిష్ఠాపన పూజలు సోమవారం రెండో రోజు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి ప్రతిష్ఠాన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణ, కేరళ వాయిద్యం, కళాకారుల కోలాటాలు, అయ్యప్ప సేవా సమితి సభ్యుల వేషధారణ ఆకట్టుకున్నాయి. కిరాణా మర్చంట్ అసోసియేషన్, గ్రీన్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం, తాగునీటి వసతి, మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సాత ఆత్మలింగం, సభ్యుడు జూలకంటి వెంకట్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

కొందుర్గు: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మండలస్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను శాఖల వారీగా గుర్తించి వాటిని ఈ ఉత్సవాల్లో అందరికి తెలిసేలా చూపాలన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ప్రత్యేకంగా గౌరవించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, ఎంపీడీఓ మహేశ్‌బాబు, ఎంపీఓ విజయ్‌కుమార్ పాల్, ఏపీఓ ప్రవళిక పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు

ఆందోళనకు గురైన ప్రజలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం నడిరోడ్డుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో ప్రజలంతా ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చి ట్రాన్స్‌కో సిబ్బందిపై మండి పడ్డారు. వెంటనే వైర్లు సరిచేయాలని సూచించారు. సిబ్బంది వచ్చి వైర్లు సరి చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

'111' ఎత్తివేత చరిత్రాత్మకం

- బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాలాభివృద్ధి
- 'శుభోదయం'లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


మొయినాబాద్: నాగిరెడ్డిగూడలో ఎమ్మెల్యేకు తన ఇంటి గోడు చెబుతున్న మహిళ

మొయినాబాద్ రూరల్: జిల్లా పరిధిలోని 84 గ్రామాలకు గుదిబండగా మారిన 111 జీఓ ఎత్తివేస్తూ సీఎం కేసీఆర్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ముర్తుజాగూడలో నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి శుభోదయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరడంతో ఆయన సంబంధిత అధికారులకు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం 111 జీఓ ఎత్తివేసిన సందర్భంగా సర్పంచ్ మాణెమ్మ గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించా రు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, ఎంపీటీసీ సభ్యుల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మా జీ సర్పంచ్ కృష్ణయాదవ్, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహేశ్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జీవంతు నా యకులు పెంటారెడ్డి, రాంచంద్రారెడ్డి, నర్సింహ, రాంచందర్, పరమేశ్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను సాధిద్దాం

మహనీయుల ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. జూన్ 4న రెడ్డిపల్లిలో నిర్వహించనున్న అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావ్‌ల విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

'రా సారు.. నా ఇల్లు చూడు'..

మొయినాబాద్: రా సారు.. నా ఇల్లు చూడు.. 40 క్రితం ఇందిరమ్మ ఇచ్చిన ఇళ్లు.. పెచ్చులూడిపో తుంది. ఇంట్ల పండుకోవాలంటేనే భయమైతుంది. కొత్త ఇళ్లు ఇప్పియ్యి సారు.. అంటూ ఓ మహిళ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు శిథిలావస్థకు చేరిన తన ఇంటిని చూపించింది. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలో సోమవారం ఎమ్మె ల్యే శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే యాదయ్యకు ఏకరవుపెట్టా రు. గ్రామంలో పర్యటిస్తున్న క్రమంలో బైండ్ల మాణెమ్మ అనే మహిళ ఎమ్మెల్యే యాదయ్యకు ఎదురుగా వెళ్లగా.. ఆమెను పలకరించి పింఛన్ వస్తుందా అని అడిగాడు. పింఛన్ వస్తుంది కానీ ఒక్కసారి నా ఇళ్లు సూడు సారు.. అంటూ ఎమ్మెల్యేను చేయి పట్టుకుని తన ఇంటికి తీసుకెళ్లింది. కొత్త ఇళ్లు కట్టియ్యండి సారు అంటూ కంటతడిపెట్టింది. స్పందించిన ఎమ్మెల్యే ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, మాజీ జెడ్పీటీసీ చంద్రలింగం గౌడ్, ఇన్‌చార్జి సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యులు అర్జున్, మల్లేశ్, శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ మహేశ్‌యాదవ్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, నాయకులు నర్సింహ గౌడ్, మనోజ్‌కుమార్, రవియాదవ్, వెంకటేశ్, రాజు, పరమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆండాలు


'మిషన్ మేరీ లైఫ్'పై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆండాలు

షాద్‌నగర్‌రూరల్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆండాలు అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ మేరీ లైఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆండాలు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆకు కూరలు, చిరుధాన్యాలు, జొన్నరొట్టె, సామలు, కొర్రలు, రాగులు, సజ్జలు, బియ్యం, గుడ్లు, పాలు, పప్పులు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పాలు, పండ్లు, గుడ్లు, పప్పులు ఉచితంగా పంపిణీ చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిప్రసాద్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, వార్డు సభ్యులు విజయలక్ష్మి, పావని, అనిత, విజయలక్ష్మి, నర్సింలు, శ్రీపతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు శారదమ్మ, రంగమ్మ, రోజా, సక్కుబాయి, నిర్మల, జంగమ్మ, చంద్రకళ, శారద, శాలిని, బాలమణి, సుజాత, సమత, పద్మావతి, కవిత, స్వాతి, పార్వతి, నీలమ్మ, దేవి, అనూష, ఆశ వర్కర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా గర్జన' పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రామస్వామి తదితరులు

షాబాద్: భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ ప్రజా గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ కన్వనర్ కె.రామ స్వామి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ పేదల కోసం పోరాటం చేస్తుందని చెప్పారు. ప్రజా గర్జనలో పేదలకు జరుగుతున్న అన్యాయలపై న్యాపోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, సహాయ కార్యదర్శి రుక్కయ్య, చేవెళ్ల మండల బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి మల్లేశ్, శ్రీను, కిష్టయ్య తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


కొత్తూరు: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన నందిగామ మండలం నర్సప్పగూడలో నిర్వహించిన బీరప్ప జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు నారాయణ రెడ్డి, శివశంకర్‌గౌడ్, అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవం

కొందుర్గు: మండల పరిధిలోని ఉమ్మెంత్యాల గ్రామంలో ఐదు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, గ్రామ బలి, క్షేత్రపాలక బలి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

పంచాయతీ కార్మికుల జేఏసీ నాయకుడు నర్సింహారెడ్డి


కొత్తూరు: ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నర్సింహారెడ్డి

కొత్తూరు: పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పలువురు కార్మికులతో కలిసి మండలకేంద్రంలో ఎంపీడీఓ శరత్ చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కనీస వేతనాలు, విధులు నిర్వహించే చోట రక్షణ పరికరాలు అందజేయాలన్నారు. అదే విధంగా జీఓ 51ను రద్దు చేసి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు అండగా ఉండి వారి సమస్యల సాధనకోసం అహర్నిషలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రం సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జీఓ 60 ప్రకారం పంచాయతీ కార్మికులకు జీతాలను అందించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల వర్కర్స్ ఎంప్లాయీస్ మండల అధ్యక్షుడు రవి, రాంచంద్రయ్య, పారేష, రోషయ్య, మల్లయ్య, జంగయ్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

'మేధా సంపూర్ణ శిక్ష'కు 'ఆదర్శ' విద్యార్థిని


సాయిసుధ

చేవెళ్ల: మేధా ఛారిటబుల్ ట్రస్ట్ స్కాలర్‌షిప్‌నకు చేవెళ్ల ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.సాయిసుధ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో మేధా సంపూర్ణ శిక్ష స్కాలర్‌షిప్‌లను అందజేస్తోందన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో ఆదర్శ పాఠశాలకు చెందిన సాయిసుధ ఎంపికైందన్నారు. ట్రస్ట్ ఈ స్కాలర్‌షిప్‌లకు ప్రతీ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా వంద మంది విద్యార్థులను ఎంపిక చేస్తోందన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

శంకర్‌పల్లి: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మోకిల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ (వాలీబాల్-2023)లో భాగంగా సోమవారం ఆయన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీ కృష్ణ ప్రియతో కలిసి 100మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూల్యా నాయక్, చందర్ నాయక్, శంకర్ నాయక్‌లు వారి తల్లిదండ్రులైన లక్ష్మీ,లక్ష్మణ నాయక్‌ల జ్ఞాపకార్థం దుస్తులు అందించారని చెప్పారు. యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోకిల సర్పంచ్ సుమిత్ర, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజునాయక్, సామాజిక కార్యకర్త వాణి, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్

చేవెళ్ల: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. సోమవారం ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించాలని ఐకేపీ వీఓఏల రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉద్యమాలు అడ్డుకునేందుకు అరెస్టులు చేయించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా వీఓఏల సమస్యలను పరిష్కరించాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో వీఓఏల మండల అధ్యక్షురాలు కవిత తదితరులున్నారు.

భారత రాజ్యాంగం పుస్తకాలు పంచండి

డీఎస్‌పీ ప్రచార కమిటీ నాయకుడు యాదయ్య మహారాజ్


తహసీల్దార్ సైదులుగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్‌పీ నాయకులు

షాబాద్: ప్రతీ పౌరుడు భారత రాజ్యాంగ పుస్తకం కలిగి ఉండాలని డీఎస్‌పీ ప్రచార కమిటీ నాయకుడు యాదయ్య మహారాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ సైదులు గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ పౌరుడికి రాజ్యాంగ పుస్తకం అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతులిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ నాయకులు నరేశ్, మల్లేశ్, రాఘవేందర్, శివ, బాలు, నవీన్, సురేందర్, దయాకర్, మహేందర్, నర్సింలు, శ్రీకాంత్, చందు, రవి, బలరాం తదితరులున్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకా తప్పనిసరి

పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్ రెడ్డి


టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువులకు, గొర్రెల, మేకల కాపరులు జీవాలకు హెచ్‌ఎస్‌బీక్యూ ఈటీ వాక్సినేషన్ టీకా తప్పకుండా వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని కక్కులూర్, సర్దార్‌నగర్, కుమ్మరిగూడ, లింగారెడ్డిగూడెం గ్రామాల్లో జీవాలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో మేకలకు, గొర్రెలకు రోగాలు రాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా ఈ టీకా వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిష్కారం చూపని పర్యటనలు ఎందుకు?

కాంగ్రెస్ నియోజకవర్గ నేత వసంతం


మాట్లాడుతున్న నాయకులు

చేవెళ్ల: సమస్యలు పరిష్కరించరని 'శుభోదయం' ఎందుకు అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు సున్నపు వసంతం ఎమ్మెల్యే కాలె యాదయ్యను విమర్శించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతం మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఓట్లు దండుకునేందుకే ఎమ్మెల్యే గ్రామాల్లో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు గ్రామాల్లోని సమస్యలు ఏకరువు పెడుతున్నా ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాకే గ్రామాల్లో పర్యటించాలన్నారు. ప్రజలు రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చినా ఆయన నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. డిగ్రీ కళాశాల భవనం నిర్మాణం ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. టీటీడీ కల్యాణ మండపం మంజూరైందని ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. గ్రంథాలయ భవన నిర్మాణానికి స్థలం కేటాయించుకుని పత్రికల్లో ఫొటోలు వేయించుకున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో గుండాల పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ బాలయ్య, నాయకులు దేవేందర్, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.

ఇళ్లు, భూములు పంచిన ఘనత కాంగ్రెస్‌దే

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్


కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: పేదలకు ఇళ్లు, భూములు పంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లికి చెందిన వివిధ పార్టీల యువకులు సర్పంచ్ నర్సింలు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాత్రమే లబ్ధిపొందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో స్వామి, యాదయ్య, రాములు, మల్లేశ్, వెంకటేశ్, రవి, కుమార్, నర్సింలు, రాంచంద్రయ్య, సాయి, ఎల్లయ్య, ఆనంద్, కుమార్, ప్రవీణ్, మహేశ్, రామస్వామి తదితరులున్నారు. నర్సింలుగౌడ్, పాండుగౌడ్, బోరయ్య, కుమార్, నర్సింహాచారి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి

కొందుర్గు: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జాకారం గ్రామంలో శివలింగం, ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు, కృష్ణారెడ్డి, నాయకులు శేఖర్, వెంకటేశ్, సీతారాములు, పాండు, గోపాల్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


కాలుష్యరహిత సమాజాన్ని నిర్మిద్దాం

సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్


ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ సాయిప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత జీవన శైలిపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్‌మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆవరణలో, వ్యవసాయ బావుల వద్ద మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లేశ్ పూజారి, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, వార్డు సభ్యులు విజయలక్ష్మి, పావని, అనిత, విజయలక్ష్మి, శ్రీపతిరెడ్డి, నర్సింలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఉపాధ్యాయులతో షాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ 1987-88 బ్యాచ్ విద్యార్థులు

షాబాద్: మొయినాబాద్ మండల పరిధిలోని బాకారం డ్రీమ్ వ్యాలీ రిసార్ట్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1987-88లో షాబాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ సమ్మేళనంలో వారి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా వారి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.